# వి.డి.సి., గ్రామ పంచాయితీ సభ్యులు 'కలిసిచేద్దాం' అనే అంశంపై శిక్షణ నమూనా

సహకారం : వాసన్

**వాసన్**

**వాటర్‌షెడ్ సపోర్ట్ సర్వీసెస్ అండ్ యాక్టివిటీస్ నెట్‌వర్క్**

12-13-452, వీధి నెం.1, తార్నాక, సికింద్రాబాదు- 500 017

ఫోన్: 7015 295/7015296

# వి.డి.సి., గ్రామ పంచాయితీ సభ్యులు

# కలిసిచేద్దాం అనే అంశంపై శిక్షణ నమూనా

లక్ష్యం:- సహజవనరులు కాపాడుకోవటం, యాజమాన్యం, అభివృద్ధి గురించి అవగాహన

✪ నేర్చుకునే ఉద్దేశాలు:

1. వనరుల ప్రాముఖ్యత, నిర్వహణ, రక్షణ, అభివృద్ధిలో రకరకాల సంస్థల పాత్రలు గురించి తెలుసుకుంటారు.
2. గ్రామస్థాయి సంఘాల మధ్య పరస్పర సంబంధాలు, ఆధారపడుటను గుర్తిస్తారు.
3. కార్యాచరణ ప్రణాళిక తయారీ విధానంలో తగిన సహకారం నేతృత్వం గురించి తెలుసుకుంటారు.
4. కలిసిచేద్దాం యొక్క ఉద్దేశాలు గురించి తెలుసుకుంటారు.

✪ విషయాలు:

1. కలసిచేద్దాం యొక్క ఉద్దేశాలు
2. వనరుల ప్రాముఖ్యత, సమస్యలు గుర్తించటం
3. కలిసి ఎందుకు పనిచేయాలి, సిబిఓల మధ్య వున్న లింకేజి
4. జిపి గ్రామ పంచాయితీ, వి.డి.సి. బాధ్యతలు
5. కార్యాచరణ ప్రణాళిక ఎందుకు, దానిలో సంఘాల పాత్ర

✪ శిక్షణ కాలం : రెండురోజులు

## సెషన్ :- 1

విషయం : కార్యక్రమపరిచయం

సమయం : 30 నిమిషాలు

పద్ధతి : ఆట, (సృజనాత్మకత)

ఉద్దేశం : అందరూ సహకరించుకోవడం ద్వారా మంచి ఫలితాలను చూడటం

కావలసిన మెటేరియల్: ఏమి అవసరం లేదు

ఆట వివరణ : ఫెసిలిటేటర్ సభ్యులను మూడు చిన్న గ్రూపులుగా ఏర్పటు చేసి వారందరిని బయటికి వెళ్ళి వారికి దొరికిన వస్తువు ఏదైనా ఉదా: ఆకు, రాయి తీసుకొని నిశ్శబ్దంగా లోపలికి వచ్చి ముందుగా ఏర్పాటు చేసిన గ్రూపుల వారీగా కూర్చోమని చెప్పాలి. మూడు గ్రూపులు ఏర్పాటైన తరువాత ఒక్కొక్క గ్రూపులో వారు తెచ్చిన వస్తువులను వారు పేరు చెబుతూ గ్రూపు మధ్యలో పెట్టాలి. ఆలా అన్ని గ్రూపులు పెట్టిన తరువాత ఫెసిలిటేటర్ గ్రూపు సభ్యులందరిని కల్సి ఒకరికొక్కరి సహకరించుకుంటూ వారు తెచ్చిన వస్తువులకి ఒక ఆకారం ఇవ్వమని చెప్పాలి.

మూడు గ్రూపులు పూర్తయిన తరువాత అందర్ని వారి స్థానాల్లో కూర్చోమని రివ్యూ చేయాలి.

- రివ్యూలో అడగవలసిన ప్రశ్నలు

1. గ్రూపుంతా కలిసి చేసినప్పుడు మీకు ఏమనిపించింది.
2. ఆ వస్తువులకు ఒక ఆకారం దొరికిన తరువాత మీ భావనలు ఏమిటి.

ఫెసిలిటేటర్‌కు సూచనలు: రివ్యూలో సభ్యులు పాల్గొన్న విధానాన్ని గమనించి ఆట యొక్క ఉద్దేశాన్ని చెపుతూ తరువాత శిక్షణలో జరిగే విషయానికి లింక్ చేసి ముగించాలి.

**సెషన్ :- 2**

విషయం : శిక్షణ యొక్క ఉద్దేశాలు

సమయం : 30 నిమిషాలు

పద్ధతి : లెక్చర్

ఉద్దేశం : శిక్షణ ఉద్దేశాన్ని తెలియజేయటం

కావలసిన మెటేరియల్: ఏమి అవసరం లేదు

శిక్షణ ఉద్దేశం :

- ❊ గ్రామాల్లోని ప్రజలు ఆ గ్రామంలోని ఆడవి, నీరు (చెరువులు) పశువులు, భూమి మొదలగు సహజవనరులపై ఆధారపడి బతుకు తున్నారు. అయితే సహజ వనరులను ఆధారంగా చేసుకొని బతుకుతున్న కొన్ని కులల వారు ఉదా: గొర్రెరె, మేకలపై ఆధారపడ్డ గొల్ల, కుర్మ కులస్థులు చెట్లను గుత్త పెట్టుకునే ముదిరాజ్ కులస్థులు, చెరువులో చేపలు పట్టుకునే బెస్త కులస్థులు మొదలగువారు వారు ఆధారపడ్డ వనరుల బాగోగులు, వాటిపై గల హక్కులను పరిరక్షించుకోవడానికి కుల సంఘాలుగా ఏర్పడ్డాయి.
- ❊ ఇవే కాకుండా గత దశాబ్ద కాలం నుంచి ఆయా గ్రామాలలోని సహజవనరులకు, మానవ వనరులకు సంబంధించి గ్రామస్థాయి సంఘాలు ఏర్పాటు చేయటం జరుగుతుంది. ఉదా: అడవి ఉన్న చోట (అడవి సంఘం) వన సంరక్షణ సమితి, నీటి పారుదల శాఖ కింద ఉన్న చెరువుల నీటి వినియోగదారుల సంఘం, పాల ఉత్పత్తిదారుల సంఘం, విద్యా కమిటీలు, తల్లుల కమిటీలు ఇలా అనేక రకాలుగా గ్రామస్థాయి సంఘాలు ఏర్పడుతున్నాయి.
- ❊ ఇవేకాకుండా చట్టబద్ధత కల్గి ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులచే గ్రామ పంచాయితీ ఉంది నిర్ణయాలు, వాటి అమలు మొదలగునవి ప్రజా ప్రతినిధుల వరకే పరిమితం కాకుండా కొంతమేరకు ప్రజల చేతుల్లోకి వెళ్ళేందు కోసం ఈ సంఘాల ఏర్పాటు ఉద్దేశం కావచ్చునేమో. కాని గ్రామ అభివృద్ధిలో ఇవి అన్ని కలిసి పనిచేయకూడదని మాత్రం కాదు.
- ❊ కాని ఇవన్ని కలసి అనుభవాలను పంచుకోవడం కాని, నిధులను పారదర్శకతలో ఉంచడంకాని అవసరమైన చోట కలిసి ఆలోచించడం కాని పనిచేయడం కాని ఎక్కడ కనిపించదు. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే వీటన్నింటి మధ్య సమన్వయం కరువైంది.
- ❊ అందుకే వివిధ గ్రామస్థాయి సంఘాల మధ్య, గ్రామ పంచాయితీల మధ్య సమన్వయం ద్వారా పేదల బతుకుదెరువులకు సంబంధించిన వనరులు (సహజ & మానవ) అభివృద్ధి జరుగుతాయి. ఈ సమన్వయ సాధనలో మనమేమి చేయగలం అనేది చర్చించటానికే ఈ శిక్షణ కార్యక్రమం.
- ❊ ప్రకృతి వనరులు ప్రాముఖ్యత అభివృద్ధి, రక్షణ, సుస్థిరత, నిర్వహణపై తెలుసుకుంటారు.
- ❊ కార్యక్రమం ఉద్దేశాలు తెలుసుకుంటారు.
- ❊ గ్రామస్థాయి సంఘాల మధ్య పరస్పర సంబంధాలు, ఒకరిపై ఒకరు ఆధారపడ్డతీరు, కలసి పనిచేయాల్సిన అవసరాన్ని గుర్తిస్తారు.
- ❊ కార్యాచరణ ప్రణాళిక తయారీోవడంలో తగిన సహకారం, నేతృత్వం వహించడం గురించి తెలుసుకుంటారు.

• నేర్చుకునే విషయాలు : ఫెసిలిటేటర్ గ్రూపు సభ్యుల నుంచి రెండురోజుల శిక్షణా కార్యక్రమంలో ఏమి తెలుసుకుంటారు అన్న విషయాలు చర్చించాలి.

బాధ్యతలు : 1. మోడరేటర్

2. రిపోర్టింగ్

3. మూల్యాంకనం

## సెషన్ :- 3

విషయం : సహజ వనరుల గుర్తింపు, సమస్యల విశ్లేషణ

సమయం : 2 గంటలు

పద్ధతి : బ్రైన్‌స్ట్రామింగ్, సమస్యా వృక్షం విశ్లేషణ

ఉద్దేశం : సహజ వనరులను గుర్తించటం, సమస్యలను ఎలా విశ్లేషణ చేయాలి తెలుసుకోవటం

కావలసిన మెటీరియల్: బ్రౌన్‌షీట్స్, మార్కర్లు, ఫ్లాష్‌కార్డులు

రీడింగ్ మెటీరియల్ : అవకాశాలు, ఆలోచనలు

సమస్యా వృక్షాన్ని విశ్లేషణ చేసే పద్ధతి : మొదటగా గ్రామంలోని సహజ వనరుల సమస్యలను గుర్తించాలి. సభ్యులను చిన్న గ్రూపులుగా చేసి ఒక్కొక్క గ్రూపుకు ఒక సమస్య ఇచ్చి ఆ సమస్యకు కారణలేమిటి అన్న విషయాన్ని ఒక చెట్టు రూపంలో విశ్లేషణ చేయమని చెప్పాలి.

ఫెసిలి టేటర్‌కు సూచనలు :

1. సమస్యా వృక్షం విశ్లేషణ పద్ధతిని ఫెసిలిటేటర్ ముందుగా చేసి చూపాలి.
2. చెట్టు రూపంలో ఎందుకు చేసామన్న ఉద్దేశాన్ని వివరించాలి. దానిలో సమస్యన్ని కాండంతోటి ముఖ్య కారణాలను చెట్టు వేళ్ళతోటి, ప్రభావాలను కొమ్మలుగా అనుకొని విశ్లేషణ చేయమనాలి.
3. గ్రూపు ప్రజెంటేషన్ అయిన తరువాత కారణాలకు, ప్రభావాలకు లింక్ చేస్తూ వివరణ ఇవ్వాలి.

## సెషన్ :- 4

విషయం : నియమాలు, నియంత్రణ యొక్క ఆవశ్యకత

సమయం : 1 1/2 గంటలు

పద్ధతి : ఆట (అదుపులేని వాడకంతో వనరులు)

ఉద్దేశం : అదుపులేని వాడకంతో వనరుల దుస్థితి గురించి తెలుసుకోవటం

కావలసిన మెటేరియల్: రాళ్ళు 300 (చిన్న చిన్నవి)

రీడింగ్ మెటీరియల్ : మార్గం చూసుకో, వనరులు కాపాడుకో అనే బ్రోచర్

ఆట వివరణ : ప్రకృతి వనరుల అభివృద్ధి, వినియోగం, నిర్వహణలో సంఘం పాత్రను నియాలు, కట్టుబాట్లు ఆవశ్యకతనూ, నియమాలు పాటించే విధానానికి కావలసిన ఏర్పాట్ల గురించి తెలియచేసే సందర్భంలో ఈ ఆటను ఆడించాలి.

### ఈ ఆట ద్వారా ఇచ్చే సందేశం / నేర్చుకునే అంశాలు:

* వ్యక్తిగత స్వార్థం వల్ల, వనరుల వినియోగం సుస్థిరంగా, అందరికీ అందుబాటులో ఉండే విధంగా జరగదు.
* సంఘంలో కట్టుబాట్లు, నియమాల వల్ల ఈ వనరుల వినియోగాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చి సుస్థిరంగా ఉపయోగించవచ్చును.
* నియమాలను భంగపరచిన సమయంలో సంఘాలు ఏం చేయాలి? నాయకత్వ లక్షణాలు ఏమిటి? అన్న విషయంపై అవగాహన.

ఆడవలసిన విధానం:

* ఫెసిలిటేటర్ శిక్షణార్థులందరినీ బయటికి వెళ్ళి, గుప్పెళ్ళలో చిన్న చిన్న కంకరరాళ్ళు తెమ్మని చెప్పాలి. వారు తెచ్చిన రాళ్ళన్నీ ఫెసిలిటేటర్ తన దగ్గర పెట్టమని చెప్పాలి.
* ఫెసిలిటేటర్ ఈ ఆటని ప్రారంభించే ముందు శిక్షణార్థుల నుండి ఎవరైనా ముగ్గురిని రమ్మని పిలవాలి. తన దగ్గర వున్న

రాళ్ళలో ఇంచుమించు 20 శాతం రాళ్ళని వాళ్ళ మధ్యలో నేలమీద ఉంచి, వాళ్ళని "అందినంత తీసుకోమ్మని" చెప్పాలి. వారు తీసుకోగా మిగిలిన రాళ్ళకి సమానమైన రాళ్ళని తాను మళ్ళీ ఇస్తానని ముందే ఫెసిలిటేటర్ వాళ్ళకి చెప్పాలి.

* వచ్చిన ముగ్గురు, తమకు తోచిన విధంగా అందినన్ని రాళ్ళని తీసుకొని వెళతారు. మిగిలిన రాళ్ళకి, సమానమైన రాళ్ళని ఫెసిలిటేటర్ మళ్ళీ మధ్యలో ఉంచాలి. ఈ విధంగా మొదటి పట్టు జరిగాక, ఫెసిలిటేటర్ ఆ ముగ్గుర్ని మళ్ళీ రెండో పట్టు కూడా తీసుకోమ్మని చెప్పాలి. రెండో పట్టు ఆడాక, మిగిలిన రాళ్ళకి సమానమైన రాళ్ళని తాను మళ్ళీ కలవాలి.
* ఈ విధంగా ఆ ముగ్గురు మధ్యలో ఉన్న రాళ్ళని పూర్తిగా ఖాళీ చేసేంతవరకు ఆడాలి.
* ఈ ఆట జరిగినంత సేపూ మిగతా వారిని గమనించమని చెప్పాలి. మొదటి దశలో ఆడిన ముగ్గురూ, ఎన్ని పట్టు ఆడారు, ఒక్కొక్కరు ఎన్ని తీసుకున్నారు - అన్న విషయాన్ని కో ఫెసిలిటేటర్ బోర్డు మీద రాయాలి.
* రెండో దశలో ఫెసిలిటేటర్ ఇంకో ముగ్గురిని ఆహ్వానించాలి. అదే ఆట ఆడాలి అని చెప్పాలి. అయితే ఈ సారి ఒక నిబంధన నియం ఉంచాలి. ముందు దశలో ఎన్ని పట్లు ఆడారో, ఈ దశలో కనీసం అంతకు రెట్టింపు పట్టు ఆడాలి అని చెప్పాలి. అయితే అది ఎలా సాధ్యపడుతుందో తెల్చుకొమ్మని, ఆ ముగ్గురినీ బయటకు పోయి చర్చించుకురమ్మని చెప్పాలి.
* వారు చర్చించుకుని వచ్చిన తర్వాత రెండో దశలో ఆట మొదలుపెట్టాలి. ముందు దశకన్నా ఈ దశలో శిక్షణార్థులు కొంచెం జాగ్రత్తగా ఆడటం వల్ల ఎక్కువ పట్టు ఆడగలరు. ఎప్పటిరాగానే ఫెసిలిటేటర్ మిగిలిన రాళ్ళకి సమానమైన రాళ్ళను తన దగ్గర వున్న రాళ్ళ నుండి మధ్యలో ఉంచాలి (ప్రతి పట్టు చివరలో)
* కో ఫెసిలిటేటర్ ఈ దశలో జరిగిన విధానాన్ని (ఎవరు, ఏ పట్టులో, ఎన్ని రాళ్ళు తీసుకున్నదీ) వివరంగా బోర్డు మీద రాయాలి.
* మూడవ దశకి ముందు ఆ ముగ్గురు శిక్షణార్దులలో ఒకరికి మీరు పెట్టుకున్న నియమాలని భంగపరచు అని ఫెసిలిటేటర్ రహస్యంగా సూచనలు ఇవ్వాలి. కో ఫెసిలిటేటర్ -మిగిలిన ఇద్దరికీ "పరిస్థితులు మారితే, ఏం చేస్తారో -ఆలోచించండి తగిన చర్య తీసుకోండి అని రహస్యంగా సలహా ఇవ్వాలి.
* మూడో దశలో అదే ఆట ఆడాలి ఈ ముగ్గురు శిక్షణార్థులు. అయితే ఈ దశలో ఆ ముగ్గురిలో ఒకరు నియమాలని భంగపరచడం వల్ల ముందు మొదటి దశలో ఆడిన విధంగానే రాళ్ళన్నీ త్వరగా అయిపోతాయి. మిగతా ఇద్దరూ వారికి తోచిన విధంగా ప్రవర్తిస్తారు. (కోపగించుకోవడం, దెబ్బలాడటం, బాధపడటం, ప్రాధేయపడటం, వగైరా)
* ఈ దశలో కూడా ఎవరు ఎన్ని రాళ్ళు, ఏ పట్టులో తీసుకున్నదో కోఫెసిలిటేటర్ రాయాలి.
* చివరిగా, ఫెసిలిటేటర్ - ఏ దశలో ఆడిన వారిని, వారి ఆలోచనలను, ప్రవర్తనని విశ్లేషించేలా ప్రశ్నలు వేయాలి.
    - మీరు ఏమనుకున్నారు?
    - ఎందుకు, ఇన్ని రాళ్ళు తీసుకున్నారు?
    - ఇంకొకరిని చూసి మీకు ఏమనిపించింది?
    - దానికి కారణం ఏమిటి?
    - ముందు దశకి, తర్వాత దశకి తేడా ఏమిటి?
    - ఏ విషయంలో మార్పులు వచ్చాయి? ఎందుకు?
    - బయట ఉండి ఆడని వారు ఏమనుకున్నారు?
* ఈ ప్రశ్నలకి సమాధానాలుగా అందరూ వనరుల వినియోగంలో నియమాల అవసరాన్ని ఆ నియమాలు భంగపరిస్తే ఏం చేయాలి? వగైరాలను గుర్తించి వివరంగా చర్చిస్తారు. ఆ రాళ్ళనే ప్రకృతి వనరులైన నీరు, భూమి, చెట్లుగా గుర్తించి వాటి యాజమాన్యంలో కావలసిన వ్యవస్థాగత ఏర్పాట్లను, అందులో వ్యక్తుల పాత్రను, నాయకత్వ లక్షణాలను గుర్తించే విధంగా చర్చ జరపాలి.

ఫెసిలిటేటర్‌కి సూచనలు:

* తన దగ్గర ఎక్కువ శాతం (80శాతం) రాళ్ళను మధ్యలో తక్కువ శాతం (10శాతం) రాళ్ళను ఉంచాలి.
* మొదటి దశలో ఫెసిలిటేటర్ టీంలో నుండి ఒకరు ఉంటే ఆట రసాభాసా కాకుండా ఆడే అవకాశం ఉంటుంది. ఒక్కొక్కసారి మొదటి దశలోనే కొందరు సామాన్యంగా ప్రవర్తించే విధానానికి భిన్నంగా ప్రవర్తిస్తే ఈ ఫెసిలిటేటర్ టీం సభ్యులు తగిన విధంగా ప్రవర్తించి ఆటలో సందేశాన్ని అందించేదానికి సహాయపడవచ్చు.

* ఆఖరిగా ఫెసిలిటేటర్ గ్రూపు సభ్యులందరికి మార్గం చూసుకో/వనరులు కాపాడుకో అనే బ్రోచర్ ఇచ్చి అందరితో చదివించి అందరికి అర్ధమయిందో లేదో ఒకసారి రివ్యూ చేసి ఈ సెషన్‌ను ముగించాలి.

## సెషన్ :- 5

విషయం : కలిసి ఎందుకు పనిచేయాలి, సిబిఓల మధ్య ఉన్న లింకేజీలను ఎట్లా సమన్వయ పర్చాలి

సమయం : 1 గంట

పద్ధతి : ఆట (వెబ్ ఆఫ్ లైఫ్)

ఉద్దేశం : గ్రామస్థాయి సంఘాల మధ్య వున్న లింకేజిల గురించి తెలుసుకోవటం

ఆట వివరణ :

ఆటపేరు : "వెబ్ ఆఫ్ లైఫ్"

**ఆట ఉద్దేశం: జీవావరణ సమతౌల్యం యొక్క ప్రాధాన్యత తెలుసుకోవడం**

**కావలసిన వస్తువులు : కొద్దిపాటి లావుగా వున్న నూలు దారం**

**సహజవనరులకు సంబంధించినవి, జీవరాసులకు చెందిన బొమ్మలను ఫ్లాష్‌కార్డులపై చిత్రించి ఉంచుకోవాలి. ఉదా: చెట్లు, నీరు, భూమి, చేప, కప్ప, పాము (బొమ్మలకు సరిపడు మందిని తీసుకోవాలి)**

**ఆడే పద్ధతి : ఫ్లాష్‌కార్డులకు సరిపడ ఎంచుకున్న వ్యక్తులను వలయాకారంలో కూర్చోబెట్టాలి. వరుసక్రమంలో పెట్టుకొని ఫ్లాష్‌కార్డులను ఒక్కొక్కరికి ఇవ్వాలి. బొమ్మలో ఉన్న దానిలా అనుభూతి పొందాలని చెప్పాలి. తదుపరి ఫెసిలిటేటర్ నూలుదారంతో ఒక్కొక్కరిని అనుసంధానపరుస్తు దారాన్ని వేలికిచుట్టి గట్టిగాలాగి పట్టుకోమని చెప్పాలి. దారంతో అనుసంధాన పరిచేటప్పుడు బొమ్మలు పట్టుకున్న వారి మధ్య సీక్వెన్స్ ఉండేటట్లు చూసుకోవాలి కాని దారం మాత్రం జిగ్‌జాగ్‌గా వచ్చేటట్టు చూసుకోవాలి అంటే అది చూడటానికి సాలెపురుగు గూడులా కనపడాలి. ఇప్పుడు సాలెగూడు తయారైంది. ఒక్కసారి గట్టిగా గుంజి పట్టుకొమ్మని చెప్పండి. తదుపరి దాన్ని మధ్యలో చేయిపెట్టి నొక్కండి. అది గట్టిగా బిగుసుకొని ఉంటుంది. ఇక వలయంలో ఉన్న సభ్యులతో చర్చకు దిగండి.**

*** భూమి మీద చెట్లన్ని తరిగిపోతున్నాయి కదా అని చెట్టు బొమ్మ పట్టుకున్న అతను దారం ఒదిలేయమని చెప్పాలి. చెట్లు పోయాయి కనుక వర్షాలు లేవు కావున నీరు లేదు, నీరు లేదు కనుక నీటిలో ఉండే కప్పలన్ని చనిపోయాయి. కప్పలన్ని పోయాయి కనుక పాములకు ఆహారం లేకుండా పోయింది. కావున పాములు చనిపోయి లాగా అన్ని నాశనమవుతున్నవిగా గుర్తించి ఆయా బొమ్మలు పట్టుకున్న వారు దారాలు వదిలేస్తారు. చివరికి సాలెగూడు లూజు అవుతుంది.**

*** దీనిని బట్టి మనకేం అర్థం అవుతుందో ప్రశ్నలు అడగాలి. ఏం చెపుతారో సమాధానాలను బోర్డుపై లిస్ట్అవుట్ చేయండి, తదుపరి ఈ కింది అంశాలను జోడించండి.**

*** ప్రకృతిలో ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంది.**

*** ఒకటి నాశనమయితే దానిపై ఆధారపడింది, దానిపై ఆధారపడింది ఇలా చాలా నాశనమవుతాయి.**

*** జీవావరణ సమతౌల్యం లేకపోతే చివరికి మనిషి కూడా ఈ భూమిపై బతకలేడు.**

**గమనిక: ఫెసిలిటేటర్ బొమ్మలను ఇచ్చేటప్పుడు జిగ్‌జాగ్ ఇవ్వాలి. దారంతో కలిపేటప్పుడు బొమ్మకు బొమ్మకు మధ్య ఆధారపడే సంబంధం ఉండేటట్టు కలుపుతూ వెళ్ళాలి. అప్పుడే అది సాలెగూడులా దారం కనిపిస్తుంది. ఉదా:**

*** పై ఆట ద్వారా కలిసి ఎందుకు పనిచేయాలి సి.బి.ఓ.ల మధ్య వున్న లింకేజీలను ఆటకు లింక్ చేసి**

**విషయాన్ని పూర్తిగా సభ్యులకు అందించి సెషన్ ముగించాలి.**

## సెషన్ :- 6

విషయం : ఒక సంఘం చేసిన పనిని ఇంకొక్క సంఘం గుర్తించటం

సమయం : 1 1/2 గంటలు

పద్ధతి : చిన్న గ్రూపు చర్చ, బ్రైన్ స్టామింగ్

ఉద్దేశం : సంఘాలు ఎలాంటి పనులు చేశారు వాటి గురించి అందరు తెలుసుకోవటం

కావలసిన వస్తువులు : బ్రౌన్‌షీట్లు, పెన్నులు

ఫెసిలిటేటర్ చేయవలసిన పని :

1. గ్రూపు సభ్యులందరిని అడుగుతూ ఎలాంటి పనులు చేశారు అన్నది గుర్తించాలి.

2. సభ్యులను గ్రూపులుగా చేసి గుర్తించిన పనులను ఏవిధంగా సాధించారు అన్న విషయాన్ని చర్చించమని చెప్పాలి. దానికి 30 నిమిషాల సమయం కేటాయించాలి.

3. చర్చలలో వచ్చిన విషయాలను సాధించిన ప్రక్రియలో పాల్గొన్న వ్యక్తుల దగ్గరకు వెళ్ళి వారికి నచ్చిన రీతిలో సాధించిన వారిని అభినందించమని చెప్పాలి.

4. అందరిని అందరు అభినందించటంలో గ్రూపు సభ్యుల భావనలు గురించి అడిగి తెలుసుకోని సెషన్ ముగించాలి.

## సెషన్ :- 7

విషయం : విడిసి, గ్రామ పంచాయితీ సభ్యుల బాధ్యతలు

సమయం : 1 1/2 గంటలు

పద్ధతి : కేస్ స్టడీ

ఉద్దేశం : బాధ్యతలు తెలియచేయటం

కావలసిన వస్తువులు : కేస్‌స్టడీ జిరాక్స్ కాపీలు, బ్రౌన్‌షీట్లు, మార్కర్లు

### విడిసి బాధ్యతలు:

ప్రతి గ్రామంలోను ఆ గ్రామ అవసరాలకనుగుణంగా వివిధ గ్రామస్థాయి సంఘాల ఏర్పాటు జరుగుతుంది. ఏ సంఘానికా సంఘం ప్రత్యేకత, ప్రాముఖ్యత కలిగి ఉన్నప్పటికి అన్ని కలిసి గ్రామ పంచాయితీ నేతృత్వంలో ఒక వేదికగా ఏర్పాటు కావలసిన అవసరాన్ని గుర్తించి, ప్రతి సంఘం నుండి ఇద్దరేసి ప్రతినిధులతో గ్రామాభివృద్ధి కమిటీగా ఏర్పాటు చేసుకుంటున్నాం. మరి ఈ కమిటీకి ఎలాంటి బాధ్యతలు ఉండాలో చూద్దాం.

### బాధ్యతలు:

* ఆయా సంఘాలు సమర్ధవంతంగా నడుచుటకు కావలసిన నియమాలను ఏర్పాటు చేసుకునేటట్టు చూడడం.
* ఆయా వనరులపై ఆధారపడిన పేదల జీవనోపాధులకు సంబంధించిన ప్రణాళికలు తయారు చేసేలా చూడటం
* ఆయా సంఘాల సభ్యుల నైపుణ్యతలు, సామర్ధ్యాలను పెంచుటకు కావలసిన శిక్షణల ఏర్పాటు
* ఏర్పాటు చేసుకున్న నియమాలను అమలు అయ్యేట్టు చూడటం
* సభ్యుల మధ్య, సంఘాల మధ్య వచ్చే తగాదాలను పరిష్కరించటం
* నెలవారి సమావేశాలు విధిగా జరిగేటట్టు చూడటం

* సంఘాల యొక్క పనితీరును సమీక్షించటం
* గ్రామ పంచాయితీకి జవాబుదారిగా వుండటం.

## సెషన్ :- 8

విషయం : కార్యాచరణ ప్రణాళిక

సమయం : 1. 30 నిమిషాలు

పద్ధతి : ప్లీనరి

ఉద్దేశం : రాబోయే ఆరునెలల కాలంలో చేయవలసిన పనులు గురించి తెలుసుకోవటం

కావలసిన వస్తువులు : బ్రౌన్‌షీట్లు, మార్కర్లు

రాబోయే ఆరునెలల కాలంలో చేయవలసిన పనుల గురించి గ్రూపు సభ్యులతో చర్చిస్తూ వచ్చిన విషయాలను గుర్తించాలి.

ఆ విషయాలు - 1. పనులు

2. ఎంత సమయం

3. బాధ్యతలు

పైన పేర్కొన్న మూడు విషయాల పట్ల కార్యాచరణ ప్రణాళిక సభ్యులతో చేయించాలి.

## సెషన్ :- 9

విషయం : కార్యక్రమం సమీకరణ, ఫీడ్‌బ్యాక్, ముగింపు

సమయం : 1 గంట

సమీకరణ చేయవలసిన పద్ధతి:

1. ఫెసిలిటేటర్ రెండు రోజుల జరిగిన కార్యక్రమంలో ఏ విషయాలు చర్చించాం, ఏ పద్ధతిలో చర్చించాం, వాటి వల్ల నేర్చుకున్న విషయాలు గురించి బోర్డుపై రాసి సమీకరణ చేయాలి.
2. శిక్షణలో పాల్గొన్న సభ్యుల స్థాయిని బట్టి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి. ఉదా: అందరూ చదువుకున్న వారయితే రాసి తీసుకోవాలి, లేకపోతే మాటల రూపంతో కార్యక్రమం పట్ల వారి అభిప్రాయాలను తెలుసుకోవాలి.
3. అందరికి ధన్యవాదాలు చెప్పి కార్యక్రమాన్ని ముగించాలి.